అస్తవ్యస్తంగా అండర్ డ్రైనేజీ

- కాలం చెల్లిన పైపులతో నిత్యం లీకేజీలు
- ఇబ్బందుల్లో తాడిపత్రివాసులు



పుట్లూరు రోడ్డులో మరమ్మతు చేస్తున్న దృశ్యం



లీకేజీ నివారణ కోసం వెళ్తున్న కార్మికుడు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి మునిసిపాలిటీలోని అండర్ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కాలం చెల్లిన పైపులతో అధికారులు సతమతమవుతున్నారు. పైపుల లీకేజీలను అరికట్టేందుకు ఒకవైపు మరమ్మతులు చేస్తుండగానే మరోవైపు పైపులు లీకేజీలు అవుతూ ఇంజనీరింగ్ అధికారులకు తలనొప్పిగా మారుతున్నాయి.మరమ్మతుల పేరుతో లక్షలాది రూపాయలను ఖర్చు చేస్తున్నారు. నిధుల విడుదల్లో జాప్యం, ఇతర కారణాల వల్ల యుద్ధప్రాతిపదికను పనులు చేయడం అటు కాంట్రాక్టర్లకు ఇటు అధికారులకు కష్టతరంగా మారింది. ఈ క్రమంలో లీకేజీల నీటితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దోమలు విజృంభించి రోగాలబారిన పడుతున్నామని వాపోతున్నారు.

వైఎస్సార్ చలువతో..

తాడిపత్రి మునిసిపాలిటీలో అండర్‌డ్రైనేజీ వ్యవస్థ రావడానికి అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి చలువే. 2007–08 మధ్యకాలంలో మంత్రిగా ఉన్న జేసీ దివాకర్‌రెడ్డి, అప్పటి మునిసిపల్ వైస్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి.. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్‌ను కలిసి అండర్ డ్రైనేజీకి అవసరమైన నిధులను కేటాయించాలని కోరారు. సకాలంలో నిధులు మంజూరు కావడంతో పనులు పూర్తయ్యాయి. పట్టణంలో ఇంటింటికి ఉచితంగా పైప్ కనెక్షన్లు ఇచ్చి అండర్ డ్రైనేజీలోకి మురికి నీరు వెళ్లే ఏర్పాట్లు చేశారు. మునిసిపాలిటీని రెండు భాగాలుగా విభజించి రెండు ఎస్‌టీపీలను నిర్మించారు. మొదటి ఎస్‌టీపీని సీపీఐ కాలనీ సమీపంలో ఏర్పాటు చేయగా మరో ఎస్‌టీపీని యల్లనూరు రోడ్డు బైపాస్ రోడ్డులో కట్టించారు. రెండు ఎస్‌టీపీల్లోకి మురికి నీరు వెళ్లేందుకు మొత్తం 18 కిలోమీటర్ల వరకూ అండర్‌డ్రైనేజీ పైపులు ఏర్పాటు చేశారు. ప్రధాన మార్గాల్లో 50 అడుగుల లోతువరకు భూమిని తవ్వి 600 ఎం.ఎం. నుంచి మీటర్ వరకు వెడల్పుగల పైపులను వేశారు. మిగిలిన చోట్ల 200 ఎం.ఎం., 300 ఎం.ఎం., 350 ఎం.ఎం., 400 ఎం.ఎం. పైపులను వేశారు. పారిశ్రామికంగా, ఇతర వనరుల కారణంగా మునిసిపాలిటీ జనాభా ఊహించని స్థాయిలో పెరిగింది. ప్రస్తుతం మునిసిపాలిటీలో 28వేల ఇళ్లు ఉన్నాయి. వాటిలో 99 శాతం వరకు అండర్ డ్రైనేజీ కనెక్షన్లను ఇచ్చామని అధికారులు అంటున్నారు. వీటి నుంచి వచ్చే మురికినీరు ఎక్కువగా ఉండటంతో పైపులపై ఎక్కువ ఒత్తిడి పడుతోంది. ఏళ్ల తరబడి భూమిలో పైపులు ఉండటం, మురికి నీరు వెళుతుండటంతో కెమికల్‌తో కూడిన గ్యాస్ ఏర్పడి పైపుల లీకేజీకి కారణమవుతోంది. అలాగే పట్టణంలోకి పెద్ద సంఖ్యలో అధిక టన్నేజీతో వాహనాల రాకపోకల వల్ల అండర్ డ్రైనేజీ పైపులు ఒత్తిడికి గురై లీకేజీకి కారణమవుతున్నాయి.

మరమ్మతులకు రూ.50 లక్షలకుపైగా ఖర్చు

ఏడాదిన్నర కాలంలో ఎస్‌టీపీ-1. 2లల్లో అండర్ డ్రైనేజీ పైపులైన్ల మరమ్మతుల కోసం దాదాపు రూ.50 లక్షలకు పైగా నిధులను ఖర్చు చేశామని ఇంజనీరింగ్ అధికారులు చెపుతున్నారు.లీకేజీలను అరికట్టడానికి యుద్ధప్రాతిపదికగా పనులు చేసేందుకు అవసరమైన నిధులను ఖర్చు చేయడం అధికారులకు సీఎఫ్ఎంఎస్ అడ్డంకిగా మారుతోంది. మునిసిపాలిటీకి సంబంధించి దాదాపు రూ.6 కోట్ల నిధులున్నా.. వాటిని ఖర్చుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావడం అలస్యమవుతోంది. ఇప్పటికే కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అండర్‌డ్రైనేజీ మరమ్మత్తులు ఇటు కాంట్రాక్టర్లు, అటు అధికారులకు కష్టంగా మారుతోంది. వీటన్నింటికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు అధికారులు ఎస్‌టీపీ-1 ప్రధాన పైపులైన్ స్థానంలో కొత్త పైపులను వేయడానికి రూ.11 కోట్లతో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో టెండర్లు పిలిచే దశలో ఉన్నామని అధికారులు చెపుతున్నారు.

మరమ్మతులు చేస్తున్నాం



పట్టణంలోని పలుచోట్ల అండర్‌డ్రైనేజీ పైపుల లీకేజీల మరమ్మతులు జరుగుతున్నాయి. పాతకోటలో పనులు పూర్తయ్యాయి. పుట్లూరు రోడ్డులో పనులు జరుగుతున్నాయి. త్వరలో నందలపాడు, శ్రీనివాసపురంల్లో లీకేజీలను అరికడుతాం. ప్రజలు కూడా అధికారులకు సహకరించి అండర్ డ్రైనేజీల్లో చెత్త చెదారం వేయరాదు.

– శివరామక్రిష్ణ, కమిషనర్

క్లుప్తంగా

రజకులపై దాడులు ఆపాలి



ఆందోళన చేస్తున్న రజకులు

తాడిపత్రి రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రజకులపై దాడులు పెరుగుతున్నాయని రజక వృత్తిదారుల సమాఖ్య తాడిపత్రి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సూరి, శ్రీరాములు ధ్వజమెత్తారు. రజకులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సోమవారం ఆందోళనకు దిగారు. శ్రీకాకుళం జిల్లా కొత్తవలస గ్రామంలో రజకులపై జరిగిన దాడుల్లో మహిళ మృతి చెందిందన్నారు. దాడులకు కారణమైన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ సీపీఐ కార్యదర్శి చిరంజీవి, శివయ్య, రంగనాథ్, పెద్ద సూరి పాల్గొన్నారు.

వైభవంగా మేరీమాత జన్మదినం



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న బిషప్ జొహన్నెస్

గుంతకల్లుటౌన్: క్రైస్తవుల ఆరాధ్య దైవం మేరీ మాత జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్‌సీఎం చర్చి ఆవరణలోని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా కర్నూల్ డయాసిస్ బిషప్ డాక్టర్ జొహన్నెస్ హాజరై భక్తులకు సందేశాన్నిచ్చారు. సాయంత్రం మేరీమాతను విశేష పుష్పాలతో అందంగా అలంకరించి ఊరేగించారు. ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణా, తమిళనాడు నుంచి భక్తులు హాజరై మేరీమాతను దర్శించుకున్నారు. కార్యక్రమంలో పాస్టర్లు చౌరప్ప, గాబ్రియేల్ జోజిరెడ్డి, ప్రవీణ్, ప్రకాష్, సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కసాపురంలో హోమం



మన్యుసూక్త హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పూర్వాభాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు ఆలయ యాగశాలలో నెట్టికంటి ఆంజనేయస్వామి వారికి తిరుమంజన స్నపనం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మన్యుసూక్త హోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నెట్టికంటుడి సేవలో ప్రముఖులు

కృష్ణ, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ సోమవారం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.

గుత్తి కోట సందర్శన

గుత్తి: గుత్తి కోటను సోమవారం గండి కోట అడ్వెంచర్ టీం సభ్యులు సందర్శించారు. టీం సభ్యులు ఈశ్వర్, మురళీకృష్ణ, దుర్గారావు, హరిప్రసాద్ రెడ్డికి గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్ష, ఉపాధ్యక్షులు విజయ భాస్కర్, సుధాకర్ నాయుడు, వీఆర్వో నాగరాజు తదితరులు స్వాగతం పలికారు. గుత్తి కోటలో అడ్వెంచర్ చేయడానికి అనువైన ప్రదేశాలను పరిశీలించారు. నివేదికను టూరిజం శాఖ అధికారులకు పంపుతామన్నారు.

తెరచుకున్న ఆలయాలు



గుత్తిలోని కాశీ విశ్వేశ్వరాలయంలో అభిషేకాలు చేస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్: చంద్రగ్రహణం కారణంగా మూతపడిన దేవాలయాలు సోమవారం సంప్రోక్షణతో తెరచుకున్నాయి. తాడిపత్రి పట్టణంలోని ప్రసిద్ధి క్షేత్రాలైన పార్వతీసమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి, భూదేవి, శ్రీదేవి సమేత చింతల వెంకటరమణస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఏటిగడ్డ ఆంజనేయస్వామి ఆలయం, పుట్లూరు రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం, మెయిన్ బజార్‌లోని కన్యకాపరమేశ్వరీమాత ఆలయం, యల్లనూరురోడ్డు, గానుగ వీధిలోని చౌడేశ్వరీదేవి ఆలయాలు, ఆర్టీసీ బస్టాండ్‌సర్కిల్ వద్ద ఉన్న సీతారామాలయం, కడప రోడ్డులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంతో పాటు పలుదేవాలయాల్లో శుద్ధి అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

గుత్తి: గుత్తిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, నగరేశ్వరాలయం, కాశీ విశ్వేశ్వరాలయం, ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, రేణుకా ఎల్లమ్మ ఆలయం, షిరిడీసాయి బాబా ఆలయం, గుత్తి ఆర్ఎస్‌లోని గౌతమేశ్వరాలయం, అప్పయ్య స్వామి ఆలయాలను ఉదయం ఏడు గంటలకే తెరిచి సంప్రోక్షణ చేశారు. అనంతరం భక్తులను అనుమతి ఇచ్చారు.

ఒకే ఊరిలో ఇద్దరికి పాము కాటు

యాడికి: మండలంలోని చందన గ్రామంలో సోమవారం ఇద్దరు వ్యక్తులు పాముకాటుకు గురయ్యారు. గ్రామస్తుల వివరాల మేరకు.. బెస్త లక్ష్మీదేవి పొలం పనులు చేస్తుండగా పాము కాటుకు గురైంది. బంధువులు ఆమెను అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు అలాగే అదే గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీలో ఉన్న గోపాల్, రామలక్షుమ్మల కుమారుడు ఇంటి ఆవరణలో మంచంపై నిద్రిస్తుండగా.. సోమవారం తెల్లవారుజామున కట్ల పాము గోపాల్ కాలికి కరిచింది. వెంటనే అతడిని అనంతపురానికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గోపాల్‌ను కర్నూల్‌కు తరలించారు.

భర్త నుంచి కుమారుడిని ఇప్పించండి



కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న డోన్‌కు చెందిన పూజిత

కర్నూలు సెంట్రల్: కుమారుడిని ఏడేళ్ల నుంచి తనకు కాకుండా చేసిన భర్త సురేష్‌బాబుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డోన్‌కు చెందిన పూజిత, ఆమె కుమార్తె రమ్య కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగింది. వారికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా సంఘం మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా పూజిత మాట్లాడుతూ.. తనకు కల్యాణదుర్గానికి చెందిన ఎం.సురేష్‌బాబుతో 2016లో పెళ్లి అయిందని, తన భర్త గుంతకల్లు రైల్వేలో ఎస్‌బీఎస్‌ఐగా పనిచేస్తున్నారన్నారు. తమ కాపురం ఐదేళ్ల పాటు పచ్చగా సాగిందని, కూతురు, కుమారుడు పుట్టారన్నారు. అయితే భర్త వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని 2021లో తనతో విడిపోయాడన్నారు. ఆ సమయంలో మూడేళ్ల వయసున్న కుమారుడు ఉజ్వల్‌ను తీసుకెళ్లాడని, ఇప్పటి వరకు కుమారుడిని చూపడం లేదన్నారు. కుమారుడిని తనకు అప్పగించాలని గుత్తి కోర్టు ఆదేశాలిచ్చినా పోలీసులు అమలు చేయడంలేదని, తనకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఆమె కోరారు.

‘అన్నదాత పోరు’ జయప్రదం చేయండి



జీకేఎస్‌లో పోస్టర్ విడుదల చేస్తున్న గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు



యాడికిలో అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

గార్లదిన్నె: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు మంగళవారం అనంతపురంలో చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమం జయప్రదం చేయాలని శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురములో ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. శింగనమల నియోజక వర్గంలోని ఆరు మండలాల రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘం నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి అన్నదాత పోరు కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నియోజక వర్గం కార్యాలయంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు జయరామిరెడ్డితో కలసి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి అన్నదాత పోరు కార్యక్రమంపై పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మంగళవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టబోయే అన్నదాత పోరు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, సర్పంచ్ పార్వతి, నాయకులు పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, గాంధీ నగర్ ఆది, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాటమయ్య, యూత్ మండల అధ్యక్షుడు పూల రంగ, బుల్లే రాజా, పూల రవి, క్రాంతి రెడ్డి, సత్తి, రఘు, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాడికి: రైతుల సమస్యలపై ఈ నెల 9న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అనంతపురంలో చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ సంజీవరాయుడు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు మండల నాయకులు, కార్యకర్తలతో కలసి వారు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోనా వెంకటశివారెడ్డి, పి.నాగిరెడ్డి, పేరం వాసుదేవరెడ్డి, బీసీ మల్లికార్జున, రంగస్వామి, మనోహర్ రెడ్డి, రామకృష్ణ, కొండారెడ్డి, సాంబశివుడు, మురళి పాల్గొన్నారు.

మిడ్ పెన్నార్ డ్యాం నుంచి దక్షిణ కాలువకు నీరు విడుదల

గార్లదిన్నె: మండలంలోని మిడ్ పెన్నార్ డ్యాం నుంచి సోమవారం హెచ్చెల్సీ అధికారులు దక్షిణ కాలువకు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా హెచ్చెల్సీ ఏఈ సురేంద్ర మాట్లాడుతూ మిడ్ పెన్నార్ డ్యాంలో ప్రస్తుతం 2.5 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ఎస్ ఈ సుధాకర్ రావు, ఈఈ పార్థసారథి, డీఓ బసవ రాజు సమక్షంలో ఆరు తడి పంటల సాగు నీటి కోసం దక్షిణ కాలువ ద్వారా 250 క్యూసెక్కులు నీరు విడుదల చేశామన్నారు. రోజూ తుంగభద్ర జలాలు డ్యాంలోకి వస్తుండడంతో 750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 250 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉందన్నారు. రెండు రోజుల తర్వాత డిస్ట్రిబ్యూటరీ కాలువలకు నీరు విడుదల చేస్తామన్నారు.

ఎరువుల దుకాణాల్లో ‘విజిలెన్స్’ తనిఖీలు

పామిడి: పట్టణంలోని ఎరువుల దుకాణాలను సోమవారంరాత్రి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా శ్రీరామ ఫర్టిలైజర్స్ షాపులో 28:28:0 ఎరువులు రూ.1.80 లక్షల విలువైన ఎరువులు, మందులు, శివసాగర్ ఫర్టిలైజర్స్ షాపులో సూపర్ రూ.18 వేలు విలువ చేసే ఎరువులను సీజ్ చేశారు. ఏఓ విజయకుమార్, వీఆర్వో గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

గార్లదిన్నె: రికార్డుల ఆధారంగా పెనకచెర్లలోని 5.40 ఎకరాల భూమి తమకే చెందేలా అధికారులు న్యాయం చేయాలని బాధిత రైతు సూర్య చంద్రరెడ్డి కోరారు. సోమవారం తహసీల్దార్ ఈరమ్మకు వినతి పత్రం అందజేశారు. కార్య క్రమంలో జంబులదిన్నె సొసైటీ మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి క్రిష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు శ్రీనాథ్, రాము, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్ షాపులను మూసివేయాలి

గుంతకల్లు: నాయీ బ్రాహ్మణుల పొట్ట కొడుతున్న కార్పొరేట్ సెలూన్ షాపులను మూసివేయించాలని క్షవర వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయ ఏఓ నాగభూషణంకు సోమవారం వివిధ సంఘాల నాయకులతో కలసి ఆయన వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సెలూన్ షాపుల్లో పని చేసే వారు ఇతర కులాలు, మతాలకు చెందిన వారే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి క్షవరం పని చేసేందుకు పిలుపించి షాపులు నిర్వహిస్తున్నారు. దీంతో సాంప్రదాయ క్షవర వృత్తి మీదే ఆధారపడి జీవిస్తున్న మాకు పనులు లేక రోడ్డున పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి గుంతకల్లులో ఏర్పాటు చేసిన కార్పొరేట్ సెలూన్ షాపులను వెంటనే ఎత్తి వేయాడానికి చర్యలు తీసుకువాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను క్షవర వృత్తిదారులు కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయి బ్రహ్మణ సేవా సంఘం పట్టణ అధ్యక్షుడు జి.లక్ష్మీనారయణ, క్షవర వృతిదారుల సంఘం పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సంచార జాతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ నాయకుడు స్వామిదాస్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, ఎస్సీ, ఎస్టీ నాయకులు మస్తాన్, నాయీ బ్రహ్మణ సంఘం నాయకులు మాణిక్యం, వేణు, పరమేష్, వెంకటేష్, పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీలో ‘కూటమి’ విఫలం



తాడిపత్రిలోని ఏడీఏ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు



గుంతకల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

తాడిపత్రి రూరల్/గుంతకల్లు రూరల్/గుత్తి/పామిడి/యాడికి/గార్లదిన్నె/బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో రైతులకు అవసరమైన ఎరువులను పంపిణీ చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, తాడిపత్రి పట్టణ కార్యదర్శి చిరంజీవిలు విమర్శించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయశాఖ ఏడీ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ ఎరువుల కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు అక్రమమార్గంలో ఎరువులను తరలించుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అనంతరం తహసీల్దార్ సోమశేఖర్, ఏడీఏ రవికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో సీపీఐ తాడిపత్రి, పెద్దపప్పూరు మండల కార్యదర్శులు నాగరంగయ్య, చింతా పురుషోత్తం, ఏపీ రైతుసంఘం నాయకులు నారాయణరెడ్డి, బీసీ సంఘం గౌరవాధ్యక్షులు బ్రహ్మయ్య, శ్రీరాములు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లు, గుత్తి, పామిడి, యాడికి, గార్లదిన్నె, నార్పలలో రైతు సంఘం నాయకులతో కలసి సీపీఐ నాయకులు రైతు సమస్యలు పరిష్కరించాలంటూ తహసీల్దార్ కార్యాలయం ధర్నా నిర్వహించారు. రైతు సమస్యలు పరిష్కరించపోతే ప్రభుత్వంపై తిరుగుబాటు చేపడతామని హెచ్చరించారు.

యువతి అదృశ్యం

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లలో ఓ యువతి అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన అశ్విని అనే యువతి పని నిమిత్తం తమ అమ్మమ్మతో కలసి ఈ నెల 5న గార్లదిన్నెకు వచ్చి కనిపించకుండా పోయింది. సాయంత్రమైనా ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించారు. యువతి ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

మహిళ అదృశ్యం

యాడికి: తల్లి అదృశ్యమైందని ఓ వ్యక్తి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. వివరాలు.. మండలంలోని తూట్రాళ్లపల్లికి చెందిన చాకలి జయమ్మ గత నెల 24న బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. పలుచోట్ల చోట్ల వెతికినా ఆమె కనిపించక పోవటంతో కుమారుడు సాయిక్రిష్ణ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రస్తా సమస్య పరిష్కరించాలి

గుంతకల్లు రూరల్: పొలం రస్తా సమస్యను పరిష్కరించాలని కోరుతూ వైటీ చెరువు గ్రామానికి చెందిన రైతు గోవింద రాజులు సోమవారం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని 731 సర్వే నెంబర్‌లో అతడికి నాలుగు ఎకరాల పొలం ఉంది. ఆ పొలానికి వెళ్లాలంటే 729 సర్వే నెంబర్‌లో వక్ఫ్‌బోర్డు భూమిని సాగుచేసుకుంటున్న ఎం.ఓబులేసు పొలం గుండా వెళ్లాల్సి ఉంటుంది. పూర్వం అదే రస్తాలో రాకపోకలు కొనసాగుతున్నాయి. కాగా గత రెండేళ్లుగా అతడు తన భూమిలో వెళ్లకూడదంటూ అడ్డుపడుతున్నాడు. ఈ విషయంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా విచారణ అనంతరం అదే రస్తాలో వెళ్లాలంటూ ఎండార్స్‌మెంట్‌కూడా ఇచ్చారు. అయినప్పటికీ ఖాతరు చేయని రైతు ఓబులేసు పొలానికి వెళ్లకుండా అడ్డుపడుతున్నాడు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ గోవింరాజులు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

నిత్యావసరాల పంపిణీ

గార్లదిన్నె(శింగనమల): శింగనమల మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం కర్పూరం ఫ్యాక్టరీ వైస్ చైర్మన్ హారీఫ్ ఆధ్వర్యంలో టీబీ రోగులకు పౌష్టికాహార సరుకులు పంపిణీ చేశారు. అనంతరం టీబీ సూపర్ వైజర్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ టీబీ పట్ల ముందు జాగ్రత్తలు అవసరమన్నారు. రోగులకు ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. టీబీ కౌన్సిలర్ వెంకటపతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మన్యం భూములు కాపాడండి

బుక్కరాయసముద్రం(నార్పల): నార్పల మండలంలోని దుర్గంలో మన్యం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని కాపాడాలని సిద్దరాచెర్ల సర్పంచ్ రామాంజనేయులు కోరారు. సోమవారం మండల కేంద్రలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ కొంత మంది మన్యం భూములు ఆక్రమించారన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమలను పరిరక్షించాలన్నారు.

‘కూటమి’ పాలనలో రైతులకు అన్యాయం



మహాసభలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

పామిడి: కూటమి నిరంకుశ రైతు వ్యతిరేక విధానాల వల్ల అన్నదాతలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం స్థానిక గుత్తి రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఆ సంఘం 9వ మహాసభలకు వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవక పోవడంతో అరకొరగా సాగుచేసిన పంటలు సైతం దిగుబడి లేని దుస్థితితో అన్నదాతలు అప్పుల పాలయ్యారన్నారు. యూరియా కొరతతో రైతులు ఇక్కట్లు వర్ణానతీతమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సుంకాల తగ్గింపు జీఓను తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. రైతు వ్యతిరేక విధానలకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలకాలని హితవు పలికారు. లేనిపక్షాన రైతన్నలను సంఘిటితపరచి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.అనిమిరెడ్డి, మల్లేసు, ముత్యాలు, చంద్రమోహన్‌రెడ్డి, దేవేంద్ర, శివ కుమార్, భాష, లక్ష్మణకుమార్, సాయి, దాసు, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

యల్లనూరు: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో బాల్యవివాహాలు, చట్టాలపై విద్యార్థినులకు ఎంఈఓ చంద్రశేఖర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజామణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం రంగనాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో మెనూ అమలు చేయాలి

పామిడి: పట్టణ ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో మెనూ సక్రమంగా అమలు చేయాలని ఏపీ హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లోని విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు తగినట్లుగా చికెన్ వడించడం లేదన్నారు. గుడ్లు, అరటిపండ్లు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. శుచి, శుభ్రత లేని నాసిరకం భోజనంతో పాటు హాస్టల్‌లో సదుపాయాలలేమితో విద్యార్థుల ఇక్కట్లు వర్ణనాతీతంగా మారాయన్నారు. హాస్టల్ ఆవరణంలో పందులు, కుక్కలు సంచరిస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో హాస్టళ్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. హాస్టళ్లకు ఇన్‌చార్జ్ వార్డెన్లు కాకుండా ఖాళీ పోస్టుల్లో వార్డెలను నియమించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మణికంఠ, చంద్రశేఖర్, భాస్కర్‌రెడ్డి, మనోజ్‌కుమార్, గోవర్ధన్, చంద్రశేఖర్‌యాదవ్, గోపినాథ్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

‘శ్రీనివాసులు ఆశయాలు కొనసాగిస్తాం’

గుంతకల్లుటౌన్: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అనేక పోరాటాలు నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు పెయింటర్ శ్రీనివాసులు ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్వామీదాస్ తెలిపారు. సోమవారం పెయింటర్ శ్రీనివాసులు వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు, సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, తిమ్మప్ప, రమేష్, ప్రజా సంఘాల నాయకులు జన్నే మస్తాన్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గార్లదిన్నె: మండలంలోని క్రిష్టాపురంలో సోమవారం ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన వేణు ఆరు సంవత్సరాల క్రితం మర్తాడుకు చెందిన లక్ష్మిని వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారన్నారు. దంపతులు గత ఐదేళ్లుగా మర్తాడులో నివాసం ఉంటున్నారు. పది రోజుల భార్యతో గొడవపడి సొంత గ్రామమైన క్రిష్టాపురం వచ్చాడు. భార్య కాపురానికి రాలేదని మనస్థాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి మృతిపై అనుమానాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.